క్లుప్తంగా

ఊమెన్ చాందీ మృతి పార్టీకి తీరని లోటు


ఊమెన్ చాందీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేరళ మాజీ ముఖ్యమంత్రి, ఏపీ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ ఊమెన్ చాందీ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమల్లేష్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఉమెన్ చాందీ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సార్లు కేరళ ముఖ్యమంత్రిగా ఆయన ఎనలేని సేవలను అందించారన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు బండి సుమంత్ కుమార్, వంశీయాదవ్, ఏరాదశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెక్కు పంపిణీ


రామకృష్ణ సతీమణికి చెక్కును అందజేస్తున్న ఎస్పీ అన్బురాజన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : డీఏఆర్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ మృతి చెందిన రామకృష్ణ పోలీసుశాఖకు అందించిన సేవలు ప్రశంసనీయమని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో రామకృష్ణ సతీమణి నాగలక్ష్మికి కార్పస్ నిధి నుండి మంజూరైన రూ. లక్ష ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కును జిల్లా ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సంక్షేమంలో భాగంగా ఈ మొత్తాన్ని అందజేశామన్నారు. అనంతరం ఆ కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్‌డూడి తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల ఉత్పత్తులకు గిరాకీ


చిరుధాన్యాలతో తయారు చేసే బిస్కెట్స్, చాక్లెట్స్ గురించి వివరిస్తున్న వీరయ్య

కడప అగ్రికల్చర్ : చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తులైన జొన్న, రాగి, కొర్ర, సజ్జల బిస్కెట్‌లతో పాటు సజ్జలతో కేక్స్, చాక్లెట్ తయారు చేసి ఆర్థిక స్వావలంబన పొందవచ్చని కేవీకే కో ఆర్డినేటర్ వీరయ్య పేర్కొన్నారు. మంగళవారం కడప నగర శివార్లలోని కేవీకేలో మూడవ రోజు సాంకేతిక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలతో బిస్కెట్ తయారీపై రైతులకు వివరించడంతోపాటు తయారు చేసుకునే విధానం గురించి చూపించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు శిల్పకళ, మహేష్ బాబు, సాయి మహేశ్వరి, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వసతి గృహాల తనిఖీ


స్టోర్ రూంలను పరిశీలిస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : వైవీయూలోని వసతిగృహాలను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ మంగళవారం తనిఖీ చేశారు. వంటశాల, స్టోర్‌రూంలో నిల్వ ఉంచిన బియ్యం, కందిపప్పు, ఆయిల్, ఇతర వస్తువులను పరిశీలించారు. వసతిగృహం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థుల భోజనాలను పరిశీలించారు. భోజన నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ వార్డెన్‌లు ప్రతిరోజూ హాస్టల్స్‌ను తనిఖీ చేయాలని సూచించారు.

డిగ్రీ మూల్యాంకనం పరిశీలన..

వైవీయూ పరీక్షల విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ మూల్యాంకనాన్ని వీసీ తనిఖీ చేశారు. సమాధాన పత్రాలు పూర్తిగా చదివిన తర్వాతే మార్కులు ఇవ్వాలని సూచించారు. నిర్ణీత సమయంలో ఫలితాలు వెలువడేలా చూడాలని పరీక్షల విభాగాన్ని ఆదేశించారు.

పార్వతీదేవికి పూజలు

రాజుపాళెం : మండల పరిధి వెల్లాల గ్రామంలోని శ్రీభీమలింగేశ్వర స్వామి ఆలయంలో ఉన్న పార్వతీదేవికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే మల్లె, జాజి, కనకాంభరం పూలు, 101 నిమ్మకాయలు వేసి అమ్మవారిని అర్చకుడు వెంకటాచలపతి శోభాయమానంగా అలంకరించారు.

• ర్యాగింగ్ నేరం


ర్యాగింగ్ వ్యతిరేక ర్యాలీలో పాల్గొన్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు, వలంటీర్లు

ర్యాగింగ్ విష సంస్కృతికి వైవీయూ విద్యార్థులు దూరంగా ఉండటం శుభపరిణామమని వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ర్యాగింగ్ నేరమని హెచ్చరించారు. క్యాంపస్‌లోని ఎంబీఏ డిపార్టుమెంటులో యాంటీ ర్యాగింగ్ వారోత్సవాలలో భాగంగా చైతన్యం చేసే పోస్టర్లను వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులుతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకటరామిరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. కె. శ్రీనివాసరావు, డా. వసుగోవర్ధన్‌రెడ్డి, డా. సరిత, డా. రెడ్డయ్య, వలంటీర్లు పాల్గొన్నారు. – వైవీయూ

• టమోటాల కోసం


టమోటల కోసం రైతు బజార్ వద్ద క్యూలో ఉన్న వినియోగదారులు

ఎన్నికల వేళ ఓటు వేసే సందర్భంలోనో.. లేకపోతే పండుగ రోజు ఆలయం వద్ద దేవుడి దర్శనం కోసం ఇలా బారులు తీరి ఉన్న జనం ఫొటోలను చూస్తుంటాం.. అయితే ఇప్పుడు టమాటాల కోసం ప్రజలు ఇలా బారులు తీరారు. కడప నగరంలోని రైతు బజార్‌కు మంగళవారం ఉదయం ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ టమాటాలు వచ్చాయి. వీటి కోసం జనాలు క్యూలో నిలబడ్డారు. కిలో సబ్సిడీతో రూ. 50 అందిస్తున్నారు. ఆధార్ కార్డు నంబర్ నమోదు చేసుకుని ఒకొక్కరికి ఒక కిలో అందజేస్తున్నారు. రైతు బజార్ నుంచి జిల్లా పరిషత్తు వరకు ఉన్న ప్రధాన రహదారి వరకు జనాలు టమాటాల కోసం ఇలా క్యూలో నిలబడ్డారు. – కడప అగ్రికల్చర్

• భక్తి భావం


రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప నగరంలోని విజయదుర్గమ్మ అమ్మవారి సన్నిధిలో మంగళవారం మహిళలు పెద్ద ఎత్తున హాజరై రాహుకాల పూజలు చేశారు. పలువురు మగవారు కూడా పూజల్లో పాల్గొన్నారు. తొలుత అమ్మవారి మూలమూర్తికి విశేష అభిషేకాలు, అలంకారం, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దర్శనానంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో రాహుకాల పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భక్తులకు పూజా విధానాన్ని వివరిస్తూ కార్యక్రమం నిర్వహింపజేశారు. నిర్వాహకులు దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. – కడప కల్చరల్

తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ–2024 కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి ఎలాంటి తప్పులు లేని ఓటరు జాబితా తయారీలో భాగస్వాములు కావాలని ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం కడప అసెంబ్లీ నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ నుంచి వచ్చేనెల 21వ తేదీ వరకు ఇంటింటికి నిర్వహించే సర్వే కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులందరికీ ప్రత్యేక శిక్షణ నిర్వహించామన్నారు. ఇప్పటికే పలు సూచనలు ఇచ్చిన అంశాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల పాత్రపై చర్చించామన్నారు. ప్రస్తుత సర్వేలో ప్రతి ఇంటిని బూత్ లెవల్ అధికారులు సందర్శించి వారి వద్ద నున్న ఓటరు జాబితా ప్రకారం ఓటర్ల వివరాలను తనిఖీ చేసి అర్హత కలిగి ఓటు లేని వారిని గుర్తించి నమోదు చేయాలన్నారు. మరణించినా, ఒకటి కన్నా ఎక్కువ నమోదైన ఓటర్లను వారి సమ్మతితో ఒకటి మాత్రమే ఉంచి మిగిలిన వాటిని ఫారం–7 ద్వారా తొలగించాలన్నారు. ఒకవేళ సవరణలు ఉన్నట్లయితే వారి పోలింగ్ స్టేషన్ పరిధిలో ఇల్లు మారిన వారిని గుర్తించి వాటిని ఫారం–8 ద్వారా సవరించాలన్నారు. బూత్ లెవెల్ ఏజెంట్లను రాజకీయ పార్టీల ప్రతినిధులు నియమించాలని, ప్రస్తుతం జరగబోయే సర్వేలో బూత్ లెవల్ అధికారులకు సహకరించాలని ఆర్డీఓ కోరారు. ఈ కార్యక్రమంలో కడప ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శివారెడ్డి, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ భాస్కర్‌రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు లక్ష్మణ్‌రావు, దాసం, వెంకట శివ, మద్దిలేటి, రామ్మోహన్, ప్రసాద్‌గౌడ్, జిలానీబాష, మల్లికార్జున, అజ్మతుల్లాఖాన్, గౌస్‌బాష తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన


శిక్షణా తరగతులలో పాల్గొన్న డ్రైవర్లు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీలో పనిచేస్తున్న డ్రైవర్లు మెలకువలు పాటించి ప్రమాదాల నివారణకు తోడ్పాటు అందించాలని కడప ట్రాఫిక్ ఎస్ఐ వెంకటయ్య పిలుపునిచ్చారు. మంగళవారం ఆర్ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో ఇంధన పొదుపు–ప్రమాద రహిత శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతపై అవగాహన కలిగి సలహాలు, సూచలను పాటించాలన్నారు. డ్రైవింగ్ సమయంలో మద్యం సేవించడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడటం నేరమన్నారు. జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వారం రోజుల్లో ఎనిమిది ప్రమాదాలు జరిగాయని తెలిపారు. ప్రజల నుంచి ప్రతిరోజు ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందించడం, బస్సులను సమయానికి నడపడం వల్ల సంస్థకు మంచి పేరు, ఆదాయం వస్తుందన్నారు. కడప డీఎం డిల్లీశ్వరరావు మాట్లాడుతూ డ్రైవర్లు మెలకువలు పాటించడం ద్వారా కేఎంపీఎల్ పెరుగుతుందన్నారు. సంస్థ పురోభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతుగా తోడ్పాటు అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ కృష్ణారెడ్డి, కడప డిపో ఎస్‌డీఐ రామయ్యలు బస్సులో డ్రైవర్లను తీసుకెళ్లి రహదారుల నిబంధనలను పాటించడం, ఓవర్‌టేక్‌పై రోడ్డు డైవర్షన్, జాగ్రత్తలు, ఇంధన పొదుపుపై వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ డిపోల డ్రైవర్లు పాల్గొన్నారు.


ఉద్యమాలను అడ్డుకోవడం డీఈఓకు తగదు


కలెక్టరేట్ ఏఓ విజయ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఫ్యాప్టో నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయులు ధర్నాలలో, ర్యాలీలలో పాల్గొనకూడదని అలా పాల్గొన్నట్లయితే చర్యలు తీసుకుంటామని డీఈఓ రాఘవరెడ్డి ఉత్తర్వులు జారీ చేయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేయడమేనని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) కడప జిల్లా చైర్మన్ విజయ్‌కుమార్ అన్నారు. డీఈఓ జారీ చేసిన సర్క్యులర్ మెమోను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కడపలోని యూటీఎఫ్ భవన్‌లో ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో తమ సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలియచేసే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిందన్నారు. కానీ ఉపాధ్యాయులు ధర్నాలు, ర్యాలీలలో పాల్గొంటే చర్యలు తీసుకుంటామని ఆదేశాలివ్వడం రాజ్యాంగ హక్కును కాలరాయడమేనన్నారు. ఈ విషయంలో డీఈఓ స్పందించి ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కు తీసుకోవాలన్నారు. సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, ఆర్‌జేడీ, డీఈఓలకు వినతిపత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, నాగరాజు, ఏపీటీఎఫ్ (1938) జిల్లా అధ్యక్షుడు వీరాంజనేయులరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ సభ్యులు అబ్దుల్లా, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకుంటే చర్యలు

– ఏడీఏ నాగరాజు


స్టాకు పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజు

కడప అగ్రికల్చర్: విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల షాపులకు సంబంధించిన స్టాకు నిర్వహణ రికార్డులు సక్రమంగా లేకుంటే చర్యలు తప్పవని ఏడీఏ నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం కడప ఎఫ్ఎస్ స్ట్రీట్‌లోని ఇన్‌పుట్స్ షాపులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లైసెన్సులు, స్టాక్ వివరాలు, ధరల బోర్డు, బిల్లులు, ఇన్‌వాయిస్‌లు, వే బిల్లులు ప్రిన్సిపల్ సర్టిఫికెట్స్ తూకాలు, స్టాక్ రిజిస్టర్‌లు పరిశీలించారు. రికార్డుల సక్రమ నిర్వహణపై పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. షాపు నిర్వహణలో రికార్డులు సరిగాలేని కారణంగా రూ. 78 వేల విలువైన సరుకు అమ్మకాలను నిలుపుదల చేశారు. ఈ కార్యక్రమంలో కడప మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

భూ రీసర్వేపై అవగాహన

చెన్నూరు : వైఎస్సార్ జగనన్న భూ రక్ష – భూ రీసర్వే, డ్రోన్ల ద్వారా చేపట్టి తద్వారా రైతుల భూ హద్దులను నిర్ణయించే విధానంపై మండల సర్వేయర్ సోమశేఖర్ మంగళవారం స్థానిక ఎంపీడీవో సభా భవనంలో రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీవో గంగనపల్లి సురేష్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, సర్పంచ్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

వీరపునాయునిపల్లె : సర్వరాయసాగర్ ప్రాజెక్టు లీకేజీల ద్వారా పంట నష్టానికి గురవుతున్న రైతులకు పంట నష్టపరిహారాన్ని రైతులకు పంపిణీ చేసేందుకు బుధవారం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నట్లు మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు. అనంతరం మండలంలోని ఇందుకూరు గ్రామంలో నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలోని ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఈమేరకు నగరంలోని డీఎం అండ్ హెచ్ఓ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లతో సంబంధంలేని పనులు చేయించరాదన్నారు. ఆన్‌లైన్ వర్క్‌ల పేరుతో పెరుగుతున్న వేధింపులను వెంటనే ఆపాలన్నారు. నాణ్యమైన 4జీ సెల్‌ఫోన్ సిమ్‌లను అందించాలన్నారు. వీరికి రూ. 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రాజామణి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి


విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని నాగరాజుపేట మున్సిపల్ హైస్కూల్‌ను కమిషనర్ ప్రవీణ్‌చంద్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 9వ తరగతి విద్యార్థులకు డిజిటల్ బోర్డు నందు గణితం పాఠాలను బోధించారు. విద్యార్థులకు కొన్ని ప్రశ్నలు ఇచ్చి వాటిని పరిష్కరించాల్సిందిగా సూచించారు. గణితంలో సులువైన పద్ధతులను విద్యార్థులకు అర్థమయ్యేలా తెలిపారు. అదేవిధంగా విద్యార్థులందరూ సులువుగా అభ్యసించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. చదువుతున్న పాఠాలను క్షుణ్ణంగా పరిశీలించి, గుర్తు పెట్టుకునే విధానాలు అనుసరించాలన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా యూనిఫారం ధరించాలని, క్రమశిక్షణతో చదువుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీఈఓ తీరు అప్రజాస్వామికం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న డీఈఓ తీరు అప్రజాస్వామికమని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో ధర్నా చేయడం సాధారణమేనన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో ర్యాలీలు, ధర్నాలు నిషేధించడం దారుణమన్నారు.

డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థులు నిరసన తెలియచేసే హక్కు లేకుండా డీఈఓ జారీ చేసిన ఉత్తర్వులు వెనక్కు తీసుకోవాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కడప డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్రప్రసాద్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు భారత్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు మామిళ్లబాబు, పీఎస్‌యూ జిల్లా కార్యదర్శి నాగేంద్ర, యూత్ కాంగ్రెస్ కార్యదర్శి తిరుమల్లేష్, డీవైఎఫ్ఐ నగర అధ్యక్షులు షాకీర్, ఏఐవైఎఫ్ నాయకులు మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు

కడప కార్పొరేషన్ : 'జగనన్న సురక్ష' కార్యక్రమంతో ప్రభుత్వ సేవలన్నీ ఇంటివద్దకే వస్తున్నాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. మంగళవారం స్థానిక 27వ డివిజన్‌లో కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎండీ జహీర్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా అఫ్జల్‌ఖాన్ మాట్లాడుతూ టీడీపీ పాలనలో రేషన్ కార్డు, పింఛన్ ఏది కావాలన్నా జన్మభూమి కమిటీల సంతకాలు కావాల్సి వచ్చేదని, వారు ఎంతోకొంత ముట్టజెప్పనిదే ఇచ్చేవారు కాదన్నారు. ప్రస్తుతం ఎవరి సంతకాలు అవసరం లేకుండా, దళారుల ప్రమేయాన్ని నివారించి నేరుగా లబ్ధిదారులకు సర్టిఫికెట్లు ఇస్తున్నారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అందించే 11 రకాల ఉచిత సర్వీసులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సేవకు సలాం



కరోనా మృతులకు అంత్యక్రియలు


జయన్నకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న మేము సైతం సేవా సంస్థ సభ్యులు, వలంటీర్ రవితేజ

కరోనా సమయంలో కొందరికి అందరూ ఉన్నా ఒంటరిగా ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. చిన్నపాటి అనారోగ్యం సోకినా కరోనానేమోనని ఎవరూ కూడా దగ్గరికిపోయేవారు కాదు. వారి బాగోగులను కూడా పట్టించుకునేవారు కాదు. అలాంటి సమయంలో వలంటీర్లు మేమున్నాం అంటూ ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరోనా బాధితుల యోగక్షేమాలను తెలుసుకోవడంతోపాటు వారికి కావాల్సిన అన్ని రకాల సేవలను నిస్వార్థంతో అందించారు. కడప నగరం 48వ డివిజన్‌లో యద్దల జయన్న (60) అక్కాయపల్లెలోని శాస్త్రి నగర్‌లో నివాసం ఉండేవారు. ఇతని భార్య కొన్ని సంవత్సరాల కిందట మృతి చెందింది. అయితే జయన్న కరోన సమయంలో మృతి చెందడంతో ముగ్గురు కుమార్తెలు తన తండ్రి చనిపోయిన విషయం తెలిసి కూడా ఎవరూ ముందుకు రాలేదు. ఆ సమయంలో తాలూకా పోలీసుల సహకారంతో రామరాజుపల్లె సచివాలయానికి చెందిన వలంటీర్ రవితేజ సాహసించి ముందుకు వచ్చి మేము సైతం సంస్థతో కలసి కరోనాతో మృతి చెందిన జయన్నకు అంత్యక్రియలు నిర్వహించాడు.

– కడప కోటిరెడ్డిసర్కిల్

రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి


ధర్నా నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : పెట్రోలు బంకు లీజు రద్దుచేసి పాత రిజిస్ట్రేషన్ కార్యాలయ ప్రదేశంలో జిల్లా, అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట అఖిలపక్ష పార్టీలు ధర్నా నిర్వహించాయి. సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, టీడీపీ నాయకులు అమీర్‌బాబు, హరిప్రసాద్, సీపీఐ నగర సహాయ కార్యదర్శి కేసీ బాదుల్లాలు మాట్లాడారు. 2002 వరకు హెడ్ పోస్టాఫీసు పక్కన జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం ఉండేదన్నారు. 2001 వరదలకు కొంతదెబ్బ తినిందని పేర్కొన్నారు. దీంతో తాత్కాలికంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని పాత రిమ్స్‌లోకి తరలించారన్నారు. సంవత్సరాలు గడిచిపోతున్నా సొంత భవనాలు నిర్మించకపోగా, నగరానికి దూరంగా ఉన్న బుద్ద టౌన్‌షిప్‌లోని అద్దె భవనంలోకి ప్రస్తుతం రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని తరలించారన్నారు. ఇందువల్ల చిన్న చిన్న పనులకు సైతం ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. గత కలెక్టర్ హరికిరణ్ పాత రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలోనే జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నిర్మించేందుకు 15 సెంట్లు కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారన్నారు. అయితే ప్రస్తుత అధికారులు ఆ ఉత్తర్వులను అమలు చేయకుండా నిర్లక్ష్యం వహించడం సబబు కాదన్నారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్‌రైటర్స్ అసోసియేషన్ నాయకులు వేణుగోపాల్, సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్, కాంగ్రెస్ నాయకులు సత్తార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు.

జైలు అధికారికి ఘన సన్మానం


జైళ్లశాఖ రాష్ట్ర అధికారి మహమ్మద్ హసన్ రెజాను సత్కరిస్తున్న అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జైళ్లశాఖ అధికారి మహమ్మద్ హసన్ రెజా ఈనెల 31వ తేదీన ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా కడప కేంద్ర కారాగార అధికారులు ఆయనను మంగళవారం ఘనంగా సన్మానించారు. అంతకుముందు ఆయన కేంద్రకారాగారాన్ని తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జైళ్లశాఖ డీఐజీ కె.రాజేశ్వరరావు, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఖాదర్‌వలీలు, కేంద్ర కారాగార పర్యవేక్షణ అధికారి ఐఎన్‌హెచ్ ప్రకాశ్ మాట్లాడుతూ మహమ్మద్ హసన్ రెజా అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. శాఖలోని ప్రతి ఒక్కరూ ఆయనను స్ఫూర్తిగా తీసుకుని విధులు నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప కారాగారాల అధికారి హుసేన్ రెడ్డి, ఉప పర్యవేక్షణ అధికారులు జవహర్ బాబు, సాంబశివరావు, డాక్టర్ జి.పుష్పలత, డిప్యూటీ సివిల్ సర్జన్ డీఎస్ వరకుమార్, పరిపాలనాధికారి, జైలర్లు, డిప్యూటీ జైలర్లు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నాం


చింతకొమ్మదిన్నె : కొలుముల్లపల్లిలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొలుములపల్లి పంచాయతీలో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని మంగళవారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. అలాగే కడప నగర పాలక సంస్థ పరిధిలోని మామిళ్ళపల్లె–1, 2, సచివాలయాలతో పాటు కొలుములపల్లె సచివాయాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమల సహాదారుడు రాజోలి వీరారెడ్డి, డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, 17వ డివిజన్ కార్పొరేటర్ చంద్రహాసరెడ్డి, 16వ డివిజన్ ఇన్‌చార్జ్ నాగిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్ కళాయాదవ్, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, సర్పంచ్ సుబ్బరాయుడు, ఎంపీటీసీ వెంకటరెడ్డి, పల్లా పెంచల్‌రెడ్డి, నీలకంఠారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, బీసీసెల్ నాయకుడు వేణుగోపాల్, ఎస్సీసెల్ నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కమలాపురం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నామని ఇది పేద ప్రజలకు రక్షగా నిస్తోందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని చిన్నచెప్పలి సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేసి మాట్లాడారు. గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్న సురక్ష.. కార్యక్రమాలు దేశంలో ఏ రాష్ట్రంలో లేవన్నారు. ఎన్టీఆర్, మహానేత వైఎస్సార్‌లు ఐదున్నరేళ్లు, జగనన్న నాలుగేళ్లు సీఎంగా పని చేశారన్నారు. చంద్రబాబు వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చి పదనాలుగున్నరేళ్ల అధికారంలో ఉన్నప్పటికి ఒక్క మంచి పథకం తీసుకురాలేక పోయాడన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నాలుగేళ్లలో ప్రజలకు రూ.3.65 లక్షల కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారన్నారు.